Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774

Editor : Dama Vijaya Kumar | Volume : 2 | issue: 44 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor


అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 2 | సంచిక :44 | శనివారం 14 ఫిబ్రవరి 2026 | వెల : 3 | పేజీలు : 4



## సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తాం

- భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చడానికే సేవా తీర్థ్, కర్తవ్య భవన్
- సేవా తీర్థ్, కర్తవ్య భవన్ ఏ చక్రవర్తి ఆకాంక్షలను నెరవేర్చడానికి కాదు
- భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిర్మించింది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

# 2026 నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన



- దేవాలయాల పవిత్రతను కాపాడతామని స్పష్టీకరణ
- నాలాగే ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారు... ప్రజలు అన్నీ గమనించి తీర్పు ఇచ్చారు
- గత పాలనలో భూ వివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయన్న సీఎం
- తిరుపతి లడ్డూ వివాదంలోకి హెరిటేజ్‌ను లాగి బ్రాండ్ దెబ్బతీశారని ఆగ్రహం
- ప్రత్యర్థిని ఆర్థికంగా దెబ్బతీయడమే ఫ్యాక్షనిస్టుల లక్ష్యమని వ్యాఖ్యలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, పాలకులు అసెంబ్లీలో తనను అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే 2019-24 మధ్య ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారని, ప్రజలు అన్నింటినీ గమనించి సరైన సమయంలో తీర్పు ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై అధికారంలోకి రాగానే 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని గుర్తుచేశారు. "మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాకు అందిన ఫిర్యాదుల్లో అత్యధికం భూ వివాదాలకు సంబంధించినవే. గత పాలకులు అడిగిన భూములు ఎవరైనా ఇవ్వకపోతే, వాటిని వెంటనే 22ఏ జాబితాలో పెట్టేసి వేధించారు. స్వయంగా చట్టాలు చేసిన ముఖ్యమంత్రే ఇలా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే బాధితులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాడేపల్లి ప్యాలస్ సమీపంలో హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం ఓ భూమి అడిగారు. అది ఇవ్వలేదని బలవంతంగా 22ఏలో చేర్చేశారు. రూ.33 లక్షలతో నిర్మాణం కోసం జీవో కూడా ఇచ్చేశారు. గత పాలకులు చేసిన పాపాలు కడగడానికే మాకు ఏడాది సమయం పట్టింది. మదనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తగులబెట్టడం వాళ్ల అరాచకాలకు నిదర్శనం. అందుకే, 2026 నాటికి ఈ రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి, ప్రతి ఒక్కరి భూమికి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించాం. భూములే కాదు, ఇసుకను కూడా వదలకుండా - మిగతా3లో



## లోక్‌సభ, రాజ్యసభ వాయిదా

- మళ్లీ మార్చి 9న ప్రారంభం
- వాయిదా పడిన పార్లమెంట్ ఉభయ సభలు
- మార్చి 9న మళ్లీ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

## 'అధికారం కోసం రాహుల్ దేశ విభజనకు ప్లాన్ చేస్తున్నారా?

- విపక్షనేతపై నిశికాంత్ దూబే ఫైర్
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీవ్ర ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే
- రాహుల్‌ను తుక్డే తుక్డే గ్యాంగ్‌కు నాయకుడిగా అభివర్ణించిన ఎంపీ



# రైతులందరూ ధైర్యంగా ఉండండి

- మీ కోసం ప్రభుత్వం పని చేస్తుంది: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో పాల్గొన్న పవన్
- వైఎస్సార్సీపీ ప్రభుత్వ దుర్మార్గ, అసమర్థ విధానాలతో రాష్ట్రం నష్టపోయిందన్న పవన్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

వైఎస్సార్సీపీ ప్రభుత్వ దుర్మార్గ, అసమర్థ విధానాలతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. అందుకే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపారని ఆయన అన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధికి అద్దం పట్టిందన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో అన్నం పెట్టే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిన విషయం గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం - మిగతా3లో





## ఎవరైనా డబ్బు ఇస్తే తీసుకోండి

- కానీ ఓటు మాత్రం మాకే వేయండి
- టీవీకే చీఫ్ విజయ్.. సేలం సభలో విజయ్ ఫైర్
- మహిళల భద్రత, శాంతిభద్రతలపై డీఎంకే ప్రభుత్వానికి సవాల్ టీవీకే అధికారంలోకి వస్తుందని స్పష్టం
- తమిళనాడులో అధికార మార్పు ఖాయం

# ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు



- వైసీపీ హయాంలో 4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు
- వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం
- వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్ గా మారింది
- శాసనమండలిలో వైసీపీని నిలదీసిన నిలదీసిన మంత్రి లోకేష్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయి. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్ గా మారిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నిలదీశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ముందుగా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. విపక్ష నేత బొత్స - మిగతా3లో



## టిబెట్ చైనాదే

- 1954లోనే నెహ్రూ సర్కారు గుర్తించింది
- సీడీఎస్ అనిల్ చౌహాన్
- తొలుత టిబెట్, ఆ వెంటనే షిన్ జియాంగ్‌ను చైనా ఆక్రమించింది
- లద్దాఖ్, లేహ్ సరిహద్దుల్లో నెహ్రూ శాంతిని కోరుకున్నారు
- అందుకే పంచశీల ఒప్పందాన్ని కుదుర్చుకొని ఉండొచ్చు
- సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

## రూ.3.38 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్లు

- నేడే రాష్ట్ర బడ్జెట్
- ఆర్థిక సవాళ్ల మధ్య రేపు శాసనసభకు 2026-27 రాష్ట్ర బడ్జెట్
- రూ.3.38 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్ల మధ్యే స్వరూపం
- సంక్షేమం, అభివృద్ధి పనులకూ పెద్దపీటవేస్తూ రూపకల్పన



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రం పునరుద్ధరణ నుంచి ప్రగతి వైపు అడుగులు వేస్తున్నప్పటికీ ఆర్థికంగా ఇంకా సుస్థిరం కావాల్సి ఉంది. పాత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. రేపు ప్రశ్నోత్తరాలు, శూన్య గంట ముగిశాక ఉదయం 11 గంటలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2026-27 వార్షిక బడ్జెట్‌ను శాసనసభకు సమర్పించనున్నారు. బడ్జెట్ రూ.3.38 లక్షల కోట్ల నుంచి - మిగతా3లో

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా బిస్కెట్లు పంపిణీ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 13:**
శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శివరాత్రి రోజున భక్తులకు చాగణం. శైలజ శ్రీకాళహస్తి దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు కుమారుడు చాగణం వంశీకృష్ణ వికేసి ప్రాజెక్ట్స్ హైదరాబాద్ వారు లక్ష రూపాయలు విలువ చేసే గుడ్ డే బిస్కెట్లు శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో బాపి రెడ్డి, ఆలయ చైర్మన్ కొట్టే సాయి కలిసి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## వాటర్ బాటిల్స్ వితరణ

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి13:**



శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేములపాటి అజయ్ కుమార్ అండ్‌టీం. శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దర్శనార్థం విచ్చేయు భక్తుల సౌకర్యార్థం లక్ష వాటర్ బాటిల్స్ శ్రీకాళహస్తి ధర్మకర్త మండలి అధ్యక్షులు కొట్టే సాయిప్రసాద్, సభ్యులకు విరాళముగా అందజేశారు.

## ప్రశాంతంగా ముగిసిన
## ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి13:**
శ్రీకాళహస్తి రాష్ట్రంలోని ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని కోర్టు పరిధిలో న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. దీంట్లో భాగంగా శ్రీకాళహస్తిలోని బార్ కౌన్సిల్లో కూడా శుక్రవారం శ్రీకాళహస్తి న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీకాళహస్తి పరిధిలో సుమారు 153 మంది ఓటు హక్కు ఉండగా 92% మంది న్యాయవాదులు శుక్రవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కుప్పం మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు

## భూసేకరణ పనులకు ప్రభుత్వ పరిపాలనా అనుమతి

### త్వరలో వేగం పుంజుకోనున్న రోడ్డు విస్తరణ పనులు

### మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 13:**
కుప్పం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు అమలు కోసం భూసేకరణకు రూ.7.41 కోట్ల అదనపు నిధులను విడుదల చేస్తూ పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లాకలెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కుప్పం పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారులను విస్తరించేందుకు భూసేకరణ అవసరమని అధికారులు నివేదించగా ప్రభుత్వం స్పందించిందని 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో అదనపు నిధులుగా రూ.7,41,09,000 విడుదల చేస్తూ ప్రభుత్వ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు కుప్పం కమిషనర్ శ్రీనివాస రావు తెలిపారు. ట్రెజరీ నియంత్రణ నిబంధనలకు సడలింపు ఇస్తూ ఈ నిధులను విడుదల చేయడం విశేషం. ఈ నిధులను భూసేకరణ ప్రక్రియకు వినియోగించి, తదుపరి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్ డైరెక్టర్‌తో పాటు కుప్పం మున్సిపల్ కమిషనర్ అవసరమైన చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేయడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే

## వారి జీవితం కొత్త బంగారులోకం

### డాక్టర్ పొన్న యుగంధర్




**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి13:**
ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే వారి జీవితం ఓ కొత్త బంగారులోకంలా ఉంటుందని గంగాధర నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పొన్న యుగంధర్ అన్నారు శుక్రవారం ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల40 మంది పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్ పెన్సిల్ పెన్,బోధన సామాగ్రిని పుల్లూరు సర్పంచ్ భవ్య పవన్ అందించారు. అలాగే ఎస్ఆర్ పురం మండలంలో ఉన్న ఆరు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సుమారు 250 మంది విద్యార్థులకు బోధన సామాగ్రిని అందిస్తానని పుల్లూరు సర్పంచ్ భవ్య పవన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనసేన పార్టీ ఇంచార్జి పొన్న యుగంధర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు సేవా దృక్పథంతో మెలగాలని విద్యార్థులకు తెలియజేశారు. అలాగే జరగనున్న పదో తరగతి పరీక్షల్లో బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిరంజీవి ఉపాధ్యక్షుడు చార్లెస్, వీర మహిళ సుబ్బలక్ష్మి, రాఘవ, ప్రధానోపాధ్యాయుడు కేశవులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చదవండి.. చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**16.3.26 తేదీ నుండి 28.3.26 ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ పబ్లిక్ పరీక్షలు (పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పటిష్టమైన భద్రతా చర్యలు మధ్య నిర్వహించాలి**

**ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల లో ఉంటుంది**

**డిఆర్‌ఓ కే మోహన్ కుమార్**

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి13:**
ఫిబ్రవరి,మార్చి నెలల్లో నిర్వహించబడ నున్న(ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్మీడి యట్,) రెగ్యులర్ ఇంటర్మీడియట్ (ప్రవశీతీఎ) పరీక్షల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించి,పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిఆర్‌ఓ కే మోహన్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోనిడిఆర్‌ఓ కార్యాలయంలోని సమావేశ మందిరములో ఇంటర్మీ డియట్ ప్రాక్టికల్ పరీక్షల పైన,(ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు, ఇంటర్మీడి యట్) పరీక్షల నిర్వహణపై ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ ఎ.రఘుపతి, డీఈవో రాజేంద్రప్రసాద్ డీఎస్పీ మహ బూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ... ఫిబ్రవరి 23 తేదీ నుండి మార్చి 24 తేదీ వరకు ఇంటర్మీడియట్ రెగ్యులర్ ప్రవశీతీఎ పరీక్షలు జిల్లాలో వివిధ కళాశాలలో,50 పరీక్షకేంద్రాలలో సుమారు 29279విద్యార్థులు theory పరీక్షలు హాజరుకానున్నా రని తెలిపారు. రెవెన్యూ పోలీస్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వార్డులు బృందాల ను ఏర్పాటు చేసుకోవాలి అన్ని పరీక్షా కేంద్రాల వద్ద144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయబడతాయి. అన్ని పరీక్షా కేంద్రాలవద్ద పటిష్టమైన బందో బస్తు ఏర్పాటు చేయాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించాలి. పరీక్షలకు సంబంధించి పుకార్లు పుట్టించే వారి పై,అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీస్ శాఖ అధి కారులను ఆదేశించారు విద్యార్థుల కోసం అవసరమైన ప్రాంతాలలో ఉదయం 6 గంటల నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతిపరీక్షా కేంద్రం వద్ద ఉదయం 9 నుండి 12 గంటల వరకు ఏఎన్ఎం/నర్సుల నియామకం చేపట్టాలి, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23 నుండి మార్చి 24 వరకు (ఉదయం 8:00 – 1:00) జజ కెమెరాల పనితీరు కోసం నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి, పిల్లలకు సూచన:

**విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8:30 నుండి 9:00 వరకు మాత్రమే అనుమతించబడతారు, 9 గంటలనుండి ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించరు.**

**సెల్ ఫోన్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను అనుమతించబడవు.**

పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి జిల్లాలో సుమారుగా ౹౹ాా ఓపెన్ స్కూల్ కు సుమారు 1063మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో చిత్తూరు,జీడి నెల్లూరు,కుప్పం,నగిరి, పుంగనూరు, పలమనేర్ నియోజకవర్గాలలో 19 పరీక్ష కేంద్రాలలో మార్చి 16వ తేదీ నుండి మార్చి 28 వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు గాను 13 పరీక్ష కేంద్రాలలో సుమారు 2528 అభ్యర్థులు పరీక్షల హాజరుకానున్నారు, మార్చి రెండో తేదీ నుండి మార్చి 13వ తేదీ వరకు పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించ డం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు,ప్రథమ చికిత్స, ఏర్పాట్లు విద్యుత్తు, బెంచులు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఓ స్పష్టం చేశారు. పరీక్షాకేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేయాలని ఆదేశించారు. పోలీసు,రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో, ఫ్లేయింగ్ స్కార్డులు, ప్రత్యేక స్కార్డులు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లన్ని మూసివేయాలని పరీక్ష పత్రాలు భద్రత మరియు అవసరమైన సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు, పరీక్ష సమయంలో సంబంధిత ఆర్డిఓలు పర్యవేక్షణలో తనిఖీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, వైద్య శాఖ సిబ్బంది మురళి, ఏపీ ట్రాన్స్కో మహమ్మద్, పోస్టల్ సిబ్బంది. ఏ భాస్కర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం.

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 13:**
రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వం పంటలు పండించే రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆల్ ఇండియా బహుజన సమాజ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి మునిరత్నం, జిల్లా గౌరవ అధ్యక్షులు మణి ఘాటుగా విమర్శించారు. అందులో భాగంగా శుక్రవారం పలమనేర్ పట్టణంలో పార్టీ కార్యాలయం నందు సరస్వతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూమినే నమ్ముకుని పంటలు పండిస్తున్న రైతన్నకు 1కేజీ యూరియా ఇవ్వలేని ప్రభుత్వం రైతుల గురించి మాట్లాడే అర్హత కోల్పోయిందని ఎద్దేవా చేశారు. వరి , వివిధ రకాల పంటలు వేసి సుమారు రెండు నెలలు కావస్తున్న ఇప్పటివరకు పంటలకు యూరియా చల్లక రైతు కంటతడి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రాలో ప్రభుత్వ చేతకానితనానికి యూరియా అందక పొరుగు రాష్ట్రం కర్ణాటకలోకి వెళ్లినా అక్కడ ఎరువులు దుకాణాల వద్ద ఆంధ్ర రైతులకు యూరియా ఇవ్వమని బోర్డులు పెట్టడం చూస్తుంటే సొంత రైతులనే కాపాడుకోలేని ప్రభుత్వంగా చరిత్రకెక్కిందన్నారు. ఇప్పటికీ యూరియా డీలర్ల వద్ద టన్నులు కొద్ది



గోడౌన్లలో ఎరువులు ఉన్న విషయం ప్రభుత్వానికి తెలిసినా డీలర్లను అడగలేక ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని నిలదీశారు. ఎక్కడ ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని తెలుసుకున్న పాలకులు రైతులు వద్ద మెప్పు పొందాలని చూపాకారానికి అచ్చేంతలు చెల్లినట్లు రెండు మూడు సచివాలయాలకు ఒకచోట సరఫరా చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకొరా వచ్చే యూరియాను కూడా అధికార పార్టీ చోటా నాయకులు తన అధికార బలముతో అర్హులైన రైతులకు అందించకుండా ముందుగానే టోకెన్లు పొంది గద్దల్లాగా తన్నుకు పోతున్నారని ఆరోపించారు. యూరియా అందకా కడుపు మండి నిలదీసిన రైతన్నల పైకి అధికార పార్టీ



కార్యకర్తలు గొడవకు వెళ్లడం సరి కాదని మండిపడ్డారు. సోమరాజు, నారాయణ శెట్టి మాట్లాడుతూ పారదర్శకంగా వ్యవహరించి అర్హులైన రైతులకు యూరియా అందించాల్సిన సచివాలయ సిబ్బంది కూడా అధికార పార్టీ నాయకులకు తలవొగ్గక తప్ప లేదన్నారు. యూరియా ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని రైతు పెట్టుకున్న ఆశలు ఆఖరుకు ఆవిరైపోయాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి డీలర్లు వద్ద నిల్వ ఉన్న యూరియాను రైతులకు సరఫరా చేయాలని లేకుంటే ప్రభుత్వమే సబ్సిడీ రూపంలో రైతులకు అందించాలని కోరారు.

# ఘనంగా యల్లంపాటి కోటేశ్వరబాబు జన్మదిన వేడుకలు





**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి13:**
శ్రీకాళహస్తి ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ,పేదల కళ్లలో ఆనందాన్ని వెతుక్కునే ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సంఘ సేవకుడు యల్లంపాటి కోటేశ్వర బాబు జన్మదిన వేడుకలు గురువారం ఉదయం నుండి రాత్రిపొద్దుపోయే వరకు శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో పండుగ వాతావరణంలో జరిగాయి. మంచికి మారుపేరుగా నిలిచే ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని వేలాది మంది అభిమానులు,స్నేహితులు స్వచ్ఛందంగా పాల్గొని ఆయనపై తమ కున్న అభిమానాన్ని చాటుకున్నారు. అమ్మ ఆశీస్సులతో ప్రారంభం యల్లం పాటికోటేశ్వరబాబు తన పుట్టినరోజు వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. తొలుత తనకు జన్మనిచ్చిన తల్లి వీరమ్మ పాదాలకు నమస్కరించి, శాలువాతో సన్మానించి ఆమె ఆశీస్సులు తీసుకున్నారు. మాతృదేవోభవ అనే సూక్తిని నిజం చేస్తూ ఆయన చేసిన ఈ పని అక్కడి వారిని ఎంతగానో ఆకట్టు కుంది.
వేడుకల కంటే సేవకే ప్రాధాన్యత ఇస్తూ జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటగిరి పాత బస్టాండు వద్ద1,000 మందికి, ఓటేరు కాలువ వద్ద 500మందికి, జల వినాయక స్వామి ఆలయం వద్ద 200మంది భక్తుల కు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ అన్ని చోట్ల అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈశ్వరయ్య కాలనీలో 50 మంది గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి మండలం అల్లిమడుగు పాఠశాలలో 65 మంది విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణం వెలంపాళెంలో టీడీపీ సీనియర్ నేత లక్కమనేని మధు బాబు, మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు నేతృత్వంలో వేల మంది అభిమానుల మధ్య క్రేన్‌తో భారీ గజమాల వేసి కోటేశ్వ రబాబును సన్మానించారు. ఈ సందర్భం గా పూర్వవిద్యార్థి పురుషోత్తం ఆధ్వర్యం లో 42 కిలోల భారీ కేక్‌నుకట్ చేశారు. యల్లంపాటి కోటేశ్వరబాబుకు రాజకీయ, సినీరంగ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళిమోహన్,కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి,నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,అలాగే బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు విజయకుమార్, మహిళా అధ్యక్షురాలు ఆలం సుమతి, కుమారి, ఉమేష్‌రావు, మిన్నల్ రవి, షాకి రాలి, మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్, వినయ్, బాలాజీ రెడ్డి, ఖాదర్, పలువురు కూటమి నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల ఆశీస్సులతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, సమా జానికి ఆయన సేవలు నిరంతరం కొనసాగాలని మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు ఆకాంక్షించారు.

## కుప్పంలో కల్తీ పాలపై వస్తున్న వార్తలు అసత్యం

### కుప్పం డి.ఎస్.పి పార్థసారథి

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి13:**
సామాజిక మాధ్యమాలు, కొన్ని న్యూస్ ఛానళ్లలో కుప్పం నియోజకవర్గంలో కల్తీ పాలు తయారీ, విక్రయాలు జరుగుతున్నాయంటూ వస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని కుప్పం డి.ఎస్.పి పార్థసారథి పత్రికా ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. గత రెండు మూడు రోజులుగా కుప్పంలో కల్తీ పాలు తయారు చేసి విక్రయిస్తున్నారంటూ ప్రచారం జరుగుతుండటంతో ప్రజల్లో అయోమయం నెలకొన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే కుప్పం నియోజకవర్గ పరిధిలో ఎక్కడా కల్తీ పాలు తయారీ లేదా విక్రయాలు జరగలేదని స్పష్టంగా పేర్కొన్నారు. కల్తీ పాలు తయారీకి సంబంధించిన ప్రధాన నిందితులు శాంతిపురం, గుడుపల్లి, రామకుప్పం మండలాలకు చెందినవారైనా, వారు కర్ణాటక రాష్ట్ర పరిధిలోనే ఈ అక్రమ కార్యకలాపాలు



నిర్వహించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. కర్ణాటక ప్రభుత్వ మిల్క్ పౌడర్, బయట మార్కెట్‌లో లభించే మిల్క్ పౌడర్, పామ్ ఆయిల్ ఉపయోగించి కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో కెజిఎఫ్ అండర్సన్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బల్లగిరి గ్రామంలో ప్రత్యేక దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వెంకటేష్, బాలాజీతో పాటు పలువురు నిందితులను అదుపులోకి తీసుకుని, ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత వివిధ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణలో ట్రాన్స్‌పోర్టర్లు, మిల్క్ పౌడర్ సరఫరాదారులు, కల్తీ పాలు కొనుగోలు చేసిన వ్యక్తులను కూడా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ప్రాథమిక విచారణలో కల్తీ పాలను పూర్తిగా కర్ణాటక రాష్ట్ర పరిధిలోనే తయారు చేసి అక్కడి డైరీలకు మాత్రమే సరఫరా చేసినట్లు తేలిందని, కుప్పం నియోజకవర్గంలోని ఏ డైరీకీ ఈ పాలు చేరలేదని పోలీసులు స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# రూ.3.38 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్లు

-మొదటిపేజీ తరువాయి

రూ.3.48 లక్షల కోట్ల మధ్య ఉండనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో రేపు ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్ కసరత్తు కొలిక్కి వచ్చింది. ఆర్థికశాఖ అధికారులు దీనికి తుదిరూపు ఇచ్చే పనిలో ఉన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రేపు సమర్పించబోయే బడ్జెట్ స్వరూపం ఇంతకు ముందుతో పోలిస్తే పెద్దగా మారే అవకాశాలు కనిపించడం లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,22,359.33 కోట్ల అంచనాలతో రాష్ట్ర బడ్జెట్‌ను సమర్పించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.3.35 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్ల మధ్య ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,22,350 కోట్లకు బడ్జెట్ సమర్పించినా ఇంతవరకు ఖర్చు రూ.2.40 లక్షల కోట్ల వరకే ఉందని ఆర్థికశాఖ వర్గాల అంచనా. జనవరి నెలాఖరు వరకు ఏపీ రెవెన్యూ రాబడి లక్షా 40 వేల 540 కోట్లుగా ఉందని ఆర్థికశాఖ అధికారులు అధికారికంగా వెల్లడించారు. ఇందుకుగానూ బహిరంగ మార్కెట్ రుణాలు కలిపి ప్రస్తుతం ఖర్చులు కొలిక్కి వస్తాయి.

కిందటి ఆర్థిక సంవత్సరం తరహాలోనే: 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఖర్చు సవరించిన అంచనాల ప్రకారం 2 లక్షల 40 వేల 500 కోట్లుగా బడ్జెట్ లెక్కలు పేర్కొంటున్నాయి. రేపటి బడ్జెట్‌లో అసలు వాస్తవంగా ఎంత ఖర్చు పెట్టారనే లెక్కలు తేలతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కిందటి ఆర్థిక సంవత్సరం తరహాలోనే ఉంది. రాబడులు 10 శాతం మించి పెరిగే అవకాశాలు కనిపించడం లేదు.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి అంచనాల ఆధారంగా బహిరంగ మార్కెట్ రుణాలకు మరికొంత అస్కారం ఉండొచ్చు. సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి పథకాలు దాదాపు పాత ఆర్థిక సంవత్సరం తరహాలోనే కొనసాగే ఆస్కారం కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు చూస్తే కిందటి ఆర్థిక సంవత్సరం బడ్జెట్ స్వరూపంతో పోలిస్తే 5 నుంచి 10 శాతం మధ్య పెరుగుదలకు అస్కారం ఉంటుందనేది అంచనా.

**బడ్జెట్‌లో తొలి ప్రాధాన్యం:**

సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం బడ్జెట్‌లో తొలి ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ పథకాల కోసం ఏడాదికి రూ.33



వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. దీంతో పాటు సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామాల అభివృద్ధి, విద్యకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు రాష్ట్ర సొంత రాబడి సరిపోతోంది.

ఇవి కాక అప్పుల అసలు, వడ్డీలు కలిపి చెల్లించేందుకు ఏడాది మొత్తానికి ఎంత లేదన్నా సుమారు రూ.60 వేల కోట్ల వరకు ఖర్చవుతోంది. ఇతర రెవెన్యూ వ్యయాలు పెరిగిపోతున్నాయి. రెవెన్యూ రాబడిలోపు రెవెన్యూ ఖర్చును పరిమితం చేసే పరిస్థితులు అనేక ఏళ్లుగా కనుమరుగయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రెవెన్యూ లోటు అంచనాలకు మించి ఉన్నాయని తాజా కాగ్ లెక్కలు విశదీకరిస్తున్నాయి.

**ఆర్థికశాఖ బడ్జెట్ మార్గదర్శకాలు విడుదల:**

బడ్జెట్ కసరత్తుకు ముందు ఆర్థికశాఖ బడ్జెట్ మార్గదర్శకాలు విడుదల చేస్తుంది. ప్రతి ప్రభుత్వశాఖ నుంచి ఆయా ప్రధాన హెడ్ల పరంగా ఎంత బడ్జెట్ అవసరమో ఆ ప్రతిపాదనలు స్వీకరిస్తుంది. ఆయా ప్రభుత్వశాఖలు తమ అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులకు ప్రతిపాదనలు సమర్పిస్తారు. అంతకుముందు సంవత్సరం ఎంత బడ్జెట్ ఇచ్చారు? ఆయా శాఖలు ఎంత మేర ఖర్చు చేశాయి? ఏయే విభాగాల్లో ఎక్కువ ఖర్చయింది? ఎక్కడ తక్కువ ఖర్చయింది అనే అంశాల ప్రాతిపదికన కొత్త బడ్జెట్ రూపొందుతుంది.

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్ని ప్రభుత్వశాఖల మంత్రులు, కార్యదర్శులతో ఇప్పటికే సమీక్షలు పూర్తి చేశారు. వారి అవసరాలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల మధ్య సమన్వయం సాధించే దిశగా బడ్జెట్ అడుగులు పడేలా ప్రయత్నిస్తున్నారు. అన్ని ప్రభుత్వశాఖలు కలిపి వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.5 లక్షల కోట్లు అవసరమని తమ ప్రతిపాదనలు సమర్పించాయి. అనవసర ఖర్చులు తగ్గించి అవసరాలపై మాత్రమే దృష్టి సారించాలనే మార్గదర్శకాలతో బడ్జెట్ అంకెలు రూపుదిద్దుకుంటున్నాయి.

# జీడీపీలో వైజాగ్ ఫస్ట్




**విశాఖపట్టణం :** ఏపీ ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం లెక్కలు విడుదల చేసింది. విశాఖపట్నం టాప్ ప్లేస్‌లో నిలిచింది. సీఎం చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం ప్రతి ఐదేళ్లకూ రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలకు తలసరి ఆదాయం ప్రతీక అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో విశాఖపట్నం అదరగొట్టింది.. మొదటి స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్థూల ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచింది. అయితే తలసరి ఆదాయంలో మాత్రం మూడో ప్లేస్‌లో నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జాతీయ ఆర్థిక సర్వే, జీఎస్‌డీపీ, జీడీపీలపై అధికారులతో చర్చించారు. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం గణాంకాలను (2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు) విడుదల చేసింది.జిల్లాల వారీగా జీడీపీ ముందస్తు అంచనాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం- రూ.1,60,771 కోట్లు, ఎన్టీఆర్ జిల్లా- రూ.1,05,173 కోట్లు, కృష్ణా జిల్లా-రూ.98,801 కోట్లు, తిరుపతి జిల్లా-రూ.98,526 కోట్లు, ఏలూరు జిల్లా-రూ.88,543 కోట్లు, నెల్లూరు జిల్లా-రూ.85,444 కోట్లు, గుంటూరు జిల్లా- రూ.83,618 కోట్లు, కడప జిల్లా-రూ.79,617 కోట్లు, అనంతపురం జిల్లా- రూ.76,849 కోట్లు, కాకినాడ జిల్లా-75,342 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లా-రూ.73,970 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా-రూ.70,512 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-రూ.63,190 కోట్లు, అనకాపల్లి జిల్లా-రూ.60,146 కోట్లు, కర్నూలు జిల్లా-రూ.54,452 కోట్లు, పల్నాడు జిల్లా- రూ.49,596 కోట్లు, చిత్తూరు జిల్లా రూ.49,303 కోట్లు, నంద్యాల జిల్లా-రూ.48,531 కోట్లు, బాపట్ల జిల్లా-రూ.48,457 కోట్లు, శ్రీకాకుళం జిల్లా-రూ.47,663 కోట్లు, ప్రకాశం జిల్లా- రూ.46,268 కోట్లు, విజయనగరం జిల్లా రూ.45,085 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా- రూ.44,859 కోట్లు, అన్నమయ్య జిల్లా రూ.36,035 కోట్లు, మార్కాపురం జిల్లా- రూ.29,031 కట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా రూ.18,583 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లా రూ.17,271 కోట్లు, పోలవరం జిల్లా-రూ.6,723 కోట్లు. జిల్లాల వారీగా తలసరి ఆదాయం చూస్తే.. విశాఖపట్నం-6,58,091, కృష్ణా-4,82,078, ఎన్టీఆర్ జిల్లా-3,91,390.. వరుసగా మూడు స్థానాల్లో ఉన్నాయి'ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసుకోవాలి. పీ 4 అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకోవాలి.. వారి ద్వారా ఆయా పేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాలన్నీ రీషెడ్యూలు చేస్తున్నాం. గత పాలనలో పాలకులు 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. భవిష్యత్తులో ఆ జిల్లాలు మరింత వృద్ధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి' అన్నారు చంద్రబాబు.పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. ఆశ్రమ హాస్టల్‌లో కలుషితమైన నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రులదే బాధ్యత. పంచాయితీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణా చర్యలు, గోకులం షెడ్లు, మేజిక్ డ్రెయిన్లు చేపట్టాలి' అని సూచించారు.

# ఆస్తి పన్ను బకాయిలుంటే ఆస్తులు సీజ్

**విశాఖపట్టణం :** విశాఖపట్నంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీవీఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. నగరంలో మొండి బకాయిలను వసూలు చేసేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి ముందుగా నోటీసులు ఇస్తున్నారు.. ఒకవేళ వారు స్పందించని పక్షంలో ఆస్తుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అప్పటికి చెల్లించినవారికి ఊహించని షాకిస్తున్నారు.. ఆ ఆస్తుల్ని సీజ్ కూడా చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కఠినగా వ్యవహరి స్తుండటంతో పెండింగ్ బకాయిలు ఒక్కొక్కటిగా వసూలవుతు న్నాయి విశాఖపట్నం జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు ఉంటే.. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.566.41 కోట్లు పన్ను రావాలి. అయితే ఇప్పటి వరకు రూ.360 కోట్లు మాత్రమే చెల్లించగా.. మిగిలిన మొండి బకాయిల్ని కూడా రాబట్టేందుకు సిద్ధమయ్యారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మొండి బకాయిలపై ఫోకస్ పెట్టారు.. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి వరుసగా నోటీసులు జారీ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో లక్షా 36వేల 149మంది ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి..




వీరందరికి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. వీరిలో లక్షా 10వేల 136మందికి అధికారులు నోటీసులు ఇచ్చారు.. అయితే వీరిలో కూడా కొందరి నుంచి స్పందన రాలేదు. ఈ క్రమంలో వారి ఆస్తుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ నోటీసులు పన్ను బకాయి వివరాలు ఉన్నాయి.. ఒకవేళ అప్పటికి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే.. వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు అధకారులు.ఇటీవల నగరంలోని ఓ సంస్థ మూడేళ్ల నుంచి రూ.87,74,916 పన్ను చెల్లించడం లేదు.. వారికి జప్తు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఈ క్రమంలో అధికారులు ఆ సంస్థ ముందు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే మరో సంస్థ ఏకంగా ఐదేళ్ల నుంచి పన్ను చెల్లించడంలేదు.. అక్కడ కూడా హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. మరో వ్యక్తి తొమ్మిదేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదు.. అక్కడ కూడా బోర్డు పెట్టారు. ఇలా బోర్డు పెట్టినా పన్ను చెల్లించనివారి ఆస్తుల్ని సీజ్ చేస్తున్నారు. ఈ తాజా పరిణామాలతో చాలామంది పన్నులు వసూలు చేస్తుండగా.. కొందరు మాత్రం వేచి చూసే ధోరణిలో ఉన్నారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నం జిల్లా తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా ఉంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సీఎం సోమవారం రోజు మంత్రులు, కార్యదర్శులలతో అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో గత ఏడాది విశాఖపట్నం జిల్లా.. స్థూల ఉత్పత్తిలో రూ.1,44,192 కోట్లతో ప్రథమ స్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా రూ.1,60,771 కోట్లతో ఫస్ట్ ప్లేస్‌లో నిలబడింది.

## 2026 నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన

-మొదటిపేజీ తరువాయి

దోపిడీ చేశారు.

తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు పవిత్రంగా భావించే శ్రీవారి దర్శనం, ప్రసాదం విషయంలోనూ వాళ్లు రాజకీయాలు చేశారు. దేవుడి పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీయాలని ప్రయత్నించారు. జరిగిన తప్పులను మేం చెప్పకుండా ఉంటే, ఆ అపవిత్రతను కొనసాగించడానికి వాళ్లు వెనుకాడరు. అందుకే, టీటీడీ సహా అన్ని దేవాలయాల్లో పవిత్రతను కాపాడే బాధ్యతను మా కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. వివేకా హత్య కేసులో వాళ్లు ఎన్ని నాటకాలు ఆడారో అందరూ చూశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో రాసి, ఆ నేరాన్ని మాపై నెట్టాలని చూశారు. ఇప్పుడు అదే తరహాలో కల్తీ నెయ్యి వివాదాన్ని మా కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు అంటగట్టి, బ్రాండ్ ప్రతిష్టను దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాల్లో భాగంగా ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయడానికి చీనీ చెట్లను నరికివేసేవారు. ఇప్పుడు అదే ఫ్యాక్షన్ బుద్ధితో మా వ్యాపారాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో మేం కఠినంగా వ్యవహరిస్తాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు" అని చంద్రబాబు హెచ్చరించారు.

## ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు

-మొదటిపేజీ తరువాయి

సత్యనారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న కాంటీన్లు మూసివేయబోమని సభలో చెప్పి మాటతప్పారని, ఇప్పుడు వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవంటూ నీతులు చెబుతున్నారని ఎత్తిచూపారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. మండలి వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవని చెబుతున్నారు. 2020- 2021 ఏడాది క్యూ-4 పెండింగ్ 683.1 కోట్లు, 2023-24 క్యూ-2, క్యూ-3, క్యూ-4 బకాయిలు 1753.98 కోట్లు, 2023-24 ఏడాది గమనిస్తే.. ఎంటీఎఫ్ ఎరియర్లు కానీ చూస్తే సుమారు రూ.895 కోట్లు బకాయిలు పెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించినట్లు సభ్యులు చెబుతున్నారు. ప్రభుత్వం మారే సమయంలో రూ.645 కోట్ల బకాయిలు చెల్లించలేదు. నేను రికార్డెడ్ గా చెబుతున్నాను. విద్యాశాఖ మంత్రిగా మాట్లాడేందుకు నాకు హక్కు ఉంది. వైసీపీ రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లారు. దీనిని నేను టేబుల్ చేస్తాను. మీరు రెడీగా ఉన్నారా అని వైసీపీ సభ్యులను నిలదీశారు. దీనిపై బొత్స స్పందిస్తూ.. వైసీపీ హయాంలో రూ.4వేల కోట్ల బకాయిలు లేవని, రెండు వాయిదాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఇంటర్ విద్యను పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని చెప్పారు.

**వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం**

నిజాలు చేదుగా ఉంటాయి. వైసీపీ సభ్యులు అబద్దాలు చెప్పి బయటకు వెళ్తున్నారు. ఇంటర్ విద్యపై దృష్టి పెట్టడం లేదంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 70వేల మంది విద్యార్థులు పెరిగారు. అదీ ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి. వైసీపీ ఐదేళ్ల కాలంలో కనీసం పుస్తకాలు బ్యాగ్స్ ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం రద్దు చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు. మేం ఇంటర్ లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాం. పుస్తకాలు ఇస్తున్నాం. 10, ఇంటర్ విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వెళ్తారు. హాయిగా టీ తాగి ఆ తలుపు నుంచి వస్తారు. చిత్తశుద్ధి ఉంటే మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే సమాధానం ఇస్తున్నాం. సమస్యలు లేవని మేం చెప్పడం లేదు. మేం వినేందుకు సిద్ధంగా ఉన్నాం. పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంలో మాదిరిగా నోరు మూసివేయడానికి కాదు మేం ఇక్కడ ఉంది. మేం చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. పరదాలు కట్టుకుని మేం తిరగడం లేదు. అసెంబ్లీకి సీఎం గారు వస్తుంటే ప్రజలు నవ్వుతూ చేతులు ఊపుతున్నారు. గత సీఎం 3వేల మంది పోలీసులను పెట్టేవారు రోడ్లపైన. యుద్ధవాతావరణం ఉండేది. ఇప్పుడు ప్రశాంతంగా, హాయిగా తిరగలుగుతున్నాం. ఇదీ మా చిత్తశుద్ధి. విపక్ష నేతను పిలిపించాలి. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారు. ప్రశ్నించే హక్కు నాకు ఉంది. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి చెప్పారు.

## రైతులందరూ ధైర్యంగా ఉండండి

-మొదటిపేజీ తరువాయి



24 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచాం. తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు జమ చేశాం. రైతులకు గత ప్రభుత్వం రూ. 1,674 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించలేదు. వారందరికీ ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎలాంటి సిఫార్సులు లేకుండానే 10 వేల మందికి ఏకకాలంలో పదోన్నతులు ఇచ్చాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 1,069 కి.మీ. రహదారుల నిర్మాణం చేపట్టారని, కొన్ని రహదారులకు గంటల వ్యవధిలోనే అనుమతులు మంజూరు చేశాం. గవర్నర్ ప్రసంగం వేళ వైఎస్సార్సీపీ సభ్యులు వెల్‌లోకి వచ్చి హంగామా చెయ్యడం హనుమంతుని ముందు కుప్పిగంతులు వేయటమే.'

-పవన్ కల్యాణ్, ఉపముఖ్యమంత్రి

కౌలు రైతులు ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో అడవి తల్లి బాట పేరుతో రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సైతం మౌలిక వసతులు, రోడ్లు, తాగునీటి వసతి కల్పించడం ద్వారా అక్కడి ప్రజల కళ్లలో వెలుగులు చూశామన్నారు. పవన్ కల్యాణ్ ప్రసంగం అనంతరం సీఎం చంద్రబాబు ఆయన వద్దకు వచ్చి బాగా మాట్లాడారని అభినందించారు. సాక్షిలో వచ్చిన కథనంపై అసెంబ్లీలో చర్చ: సాక్షి పత్రిక తనపై అసభ్యకర కథనాలు ప్రచురించిందని జనసేన పార్టీకి చెందిన యలమంచిలి ఎమ్మెల్యే సుందరం విజయకుమార్ ఆరోపించారు. తాను భూకబ్జాకు పాల్పడినట్లు సాక్షిలో వచ్చిన కథనంపై అసెంబ్లీలో మాట్లాడారు. అసత్య కథనాల వల్ల తన గౌరవానికి భంగం కలిగిందని దీనిపై సభాహక్కుల కమిటీకి ఫిర్యాదు పంపాలని విజ్ఞప్తి చేశారు. అ సమయంలో అసెంబ్లీలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ఈ విషయాన్ని ప్రివిలేజ్ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు.

ప్రతిపక్ష హోదా తప్ప ప్రజా సమస్యలపై ఆసక్తి లేదు: గత ప్రభుత్వంలో పంచాయతీలు, జెడ్పీ నిధులు పక్కదారి పట్టించారని జనసేన ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ యాదవ్, సుందరపు విజయ్ కుమార్‌లు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పాలన జరుగుతోందని, అడవితల్లి బాట పట్టి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 1050 కిలోమీటర్ల రోడ్లు వేయించారని చెప్పారు. వైఎస్సార్సీపీ నేతలు ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు తప్ప ప్రజా సమస్యల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. విశాఖ వేదికగా త్వరలో 5 లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు తిరిగి తాము అధికారంలోకి వస్తామంటూ అధికారులను, పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మూడు బిల్లులకు ఆమోదం**

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఇవాళ మూడు బిల్లులకు ఆమోదం లభించింది. మున్సిపల్ చట్టంలో సవరణలు చేస్తూ రెండు బిల్లులను ప్రవేశ పెట్టారు. మంత్రి నారాయణ శాసనమండలిలో ఉండటంతో ఆయన బదులు మంత్రి టీజీ భరత్ ఈ బిల్లులు ప్రవేశ పెట్టారు. విద్యుత్తు చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ మూడు బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే అసెంబ్లీలో ఆమోదం పొందాయి.

## బిజినెస్

### మంకలదొడ్డి పంచాయతీలో యూరియా పంపిణీ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి13:**
కుప్పం మండలం మంకలదొడ్డి పంచాయతీ పరిధిలో రైతులకు యూరియా ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ జెఎంసీ మురళీ పాల్గొని రైతులకు యూరియా సంచులను అందజేశారు. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జ్ పలన, కనకరాజులు, మురుగన్‌తో పాటు పంచాయతీ స్థానిక నాయకులు పాల్గొన్నారు. రైతులకు సమయానికి ఎరువులు అందించడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని సబ్సిడీపై యూరియా అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

**సింగల్ విండో ఛైర్మన్ వెంకట మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో**

## రోడ్డుకు మరమ్మత్తులు



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి13:**
చిత్తూరుజిల్లా పలమనేరు మండలం మొరం పంచాయతీ తొప్పనపల్లిలో జరుగు మహాశివ రాత్రి ఉత్సవం సందర్భంగా ఆ గ్రామంలోని శివాలయంకు ఎక్కువ మంది. భక్తులు వస్తారు కాబట్టి దారి గుంతల మయంగా మారడంతో ఆ గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు బయ్యప్ప గారి పల్లి పంచాయితీ సింగల్ విండో ఛైర్మన్ వెంకట ముని రెడ్డి, స్పందించి వెంటనే దారికి మన్నుతోలి భక్తులకు ఎటువంటి ఇబ్బంది. కలగక్కుండా ఉండేందుకు రోడ్డు మరమ్మత్తులు చేసిదు దీనికి పలువురు ప్రజల సంతోషం వ్యక్తం చేశారు.

### రూ.100, రూ.500 నోట్లు మారబోతున్నాయా..

# ఆర్బీఐ చేయబోతున్న మార్పులేంటి

దేశంలో ప్రస్తుతం ఎక్కువగా వినియోగిస్తున్న కరెన్సీ రూ.100, రూ.500. అయితే, ఈ నోట్లు త్వరలో మారబోతున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది కరెన్సీ నోట్ల విషయంలో కీలక మార్పులు తీసుకునే ఆర్బీఐ రూ.100, రూ.500 నోట్లలో మార్పులు తీసుకురానుంది. అలాగని పాత నోట్లను ఆర్బీఐ రద్దు చేయడం లేదు. కాబట్టి, వినియోగదారులు కంగారు పడాల్సిన అవసరం లేదు. మార్కెట్లో చెలామణిలో ఉన్న నోట్ల విషయంలో సెక్యూరిటీ, ఎక్కువ కాలం మన్నిక వంటి అంశాల్లో ఆర్బీఐ సమీక్ష చేస్తుందనే సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా రూ.100, రూ.500 నోట్లలో మార్పులు చేయాలని నిర్ణయం తీసుకుంది. చాలా కాలంగా ఈ నోట్లు చెలామణిలో ఉండటంతో కొన్ని చిరిగిపోవడం, రంగు పాలిపోవడం, ప్రింటెడ్ ఫీచర్లు సరిగ్గా కనిపించకపోవడం, సెక్యూరిటీ ఫీచర్లను గుర్తించలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే నకిలీ నోట్లు కూడా చెలామణిలో ఉన్నాయి. దీంతో కొత్తగా మరింత సెక్యూరిటీ కలిగిన నోట్లను తీసుకురానున్నారు. రూ.100 నోట్లకు సంబంధించి రీ డిజైన్ అంటూ లేదు కానీ, పాత నోట్లలోనే కొన్ని కొత్త మార్పులు చేస్తారు. ప్రింట్‌లో నాణ్యత, ఇంకు ఎక్కువ కాలం ఉండటం, వాటర్ మార్క్స్, సెక్యూరిటీ థ్రెడ్‌ను మరింత నాణ్యతగా తీర్చిదిద్దుతున్నారు. దీనివల్ల ఆ నోట్లను ఒరిజినలా కాదా అని సులభంగా గుర్తించవచ్చు. ఎక్కువ కాలం మన్నేలా, మడత పెట్టినా త్వరగా పాడవకుండా ఉండేలా ఈ నోట్లు ఉంటాయి. ముఖ్యంగా నోట్ల లైఫ్ టైం పెరిగేలా చేస్తున్నారు. దీనివల్ల



తరచూ కొత్త నోట్లు ముద్రించాల్సిన ఖర్చు తగ్గుతుంది. కొత్త నోట్లు పాత డిజైన్‌లోనే ఉన్నా.. ప్రతి డీటైలింగ్ సులభంగా, స్పష్టంగా గుర్తించేలా ఉంటుంది. రూ.500 నోట్లకు సంబంధించి డిజైన్‌లో స్వల్ప మార్పులున్నాయి. నోట్ల కలర్ మరింత స్పష్టంగా, మైక్రో డీటైల్స్‌తో రానున్నాయి. కొత్త నోట్లతో ఏటీఎంలలో కూడా ఎలాంటి సమస్యలు రావని ఆర్బీఐ చెబుతోంది. పాత నోట్లతోపాటు, కొత్త నోట్లను కూడా ఏటీఎంలలో యాక్సెప్ట్ చేస్తారని తెలిపింది. ప్రజలు కొత్త నోట్లతోపాటు పాతవాటిని కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. కొత్త నోట్లలో ప్రధానంగా సెక్యూరిటీ పరమైన మార్పులే కనిపిస్తాయి.

## ఉచితంగా రూ.1000 ఫాస్ట్‌ట్యాగ్ రీఛార్జ్!

జాతీయ రహదారులపై ప్రయాణించే.. ప్రయాణికులకు మరింత సౌకర్యం & పరిశుభ్రత కల్పించాలనే లక్ష్యంతో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (చీనాూ×) ఓ కొత్త కార్యక్రమం ప్రారంభించింది. దీని ద్వారా రూ. 1000 విలువైన ఫాస్ట్‌ట్యాగ్ రీచార్జ్ ఉచితంగా పొందవచ్చని ప్రకటించింది. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్‌హెచ్‌ఏఐ 'క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్' పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం 2026 జూన్ 30 వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం ఏమిటంటే.. జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలలోని మరుగుదొడ్ల పరిశుభ్రతను మెరుగుపరచడం.
జాతీయ రహదారులపై ప్రయాణించే వారిలో చాలామంది.. టోల్ ప్లాజాలలో ఉన్న మరుగుదొడ్లను ఉపయోగిస్తున్నారు. అయితే కొన్ని చోట్ల పరిశుభ్రత లోపించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రజల సహకారం కోరుతోంది. కాబట్టి ఎవరైనా.. టోల్ ప్లాజాలలో మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉందని గమనిస్తే.. ఫోటో తీసి రాజ్‌మార్గయాత్ర యాప్ లేటెస్ట్ వెర్షన్ ద్వారా జియో-ట్యాగ్




చేసిన ఫోటోలను పేరు, ప్రదేశం, వెహికల్ రిజిస్ట్రేషన్ నంబర్ & మొబైల్ నంబర్‌తో సహా వివరాలతో అప్‌లోడ్ చేయాలి. సంబంధిత అధికారులు ఫోటోలను పరిశీలించి.. సమాచారం నిజమని ధ్రువీకరిస్తే, ఫోటోలను షేర్ చేసిన వారి వెహికల్ నెంబర్‌కు రూ. 1000 విలువైన ఫాస్ట్‌ట్యాగ్ రీఛార్జ్ బహుమతిగా లభిస్తుంది. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని.. రహదారులపై పరిశుభ్రతను మెరుగుపరచడానికి సహకరిస్తారని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తోంది.

## స్పోర్ట్స్

### టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాకు షాక్..

# జింబాబ్వే సంచలన విజయం

**కొలంబో:** టీ20 వరల్డ్‌కప్‌లో సంచలన నమోదు అయ్యింది. కొలంబోలో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాంబే విక్టరీ కొట్టింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి. జింబాబ్వే విసిరిన టార్గెట్‌ను అందుకునే క్రమంలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్‌బానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్‌లో కేవలం 29 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా.ఆ తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్, రెన్‌షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి




బ్యాటర్లు జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అతను వంద వికెట్ల తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు.

### పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశం ఉంది : వరుణ్ చక్రవర్తి

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అభిషేక్.. గురువారం నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడని విషయం తెలిసిందే. అయితే అభిషేక్ శర్మ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వరుణ్ చెప్పాడు. ఆరోగ్యం క్షీణించడం వల్ల రెండు రోజుల పాటు అభిషేక్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అభిషేక్‌తో మాట్లాడానని, అతను బాగానే ఉన్నాడని, ఇవాళ కొంత ప్రాక్టీస్ చేశాడని, సిద్ధం అవుతున్నట్లు అతను చెప్పాడని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు.
నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు ఓవర్లు వేసి 7 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్ టాస్ వేసిన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు అభిషేక్ శర్మ మిస్సయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అభిషేక్ శర్మ గైర్హాజరీలో నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టాడు. వరల్డ్‌కప్‌లో ఇండియా వరుసగా తన రెండో




మ్యాచ్ నెగ్గింది. నమీబియాపై 93 రన్స్ తేడాతో నెగ్గింది. ఒకవేళ కొలంబోలో జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ పాల్గొంటే అతను పాక్‌తో మ్యాచ్‌కు ఆడేది లేనిది తేలే అవకాశం ఉంటుంది. నెట్స్‌లో చాలా సమయం అతను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ఇండోపాక్ మ్యాచ్‌పై క్లారిటీ వస్తుంది.

### క్రికెట్ అభిమానులకు బ్యాడ్‌న్యూస్!




అవాంతరాలన్నీ తొలగి భారత్- పాకిస్తాన్ మ్యాచ్ నిర్వహణకు మార్గం సుగమమైంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి జోక్యంతో దిగివచ్చిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తాము టీమిండియాతో ఆడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో దాయాదుల పోరును వీక్షించాలని ఉవ్విళ్లూరుతున్న అభిమానులకు ఓ చేదు వార్త. సాంకేతికంగా మ్యాచ్ నిర్వహణకు లైన్ క్లియర్ అయినా.. వాతావరణం ఇందుకు సహకరించేలా కనిపించడం లేదు. కాగా టీ20 ప్రపంచకప్-2026 టోర్నీ ఫిబ్రవరి 7న భారత్- శ్రీలంక వేదికగా మొదలైన విషయం తెలిసిందే. మొత్తంగా ఇరవై జట్లు పాల్గొంటున్న ఈ ఐసీసీ ఈవెంట్లో గ్రూప్-'ఎ' నుంచి భారత్, పాకిస్తాన్, అమెరికా, నమీబియా, నెదర్లాండ్స్ పోటీపడుతున్నాయి. ఇందులో భాగంగా టీమిండియా అమెరికా, నమీబియాలపై గెలుపొందగా.. పాక్ జట్టు నెదర్లాండ్స్, అమెరికాలపై జయభేరి మోగించింది. ఫలితంగా గ్రూప్-ఎ నుంచి చెరో రెండు విజయాలతో భారత్- పాక్ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. చెరో నాలుగు పాయింట్లతో సమంగా ఉన్నా.. నెట్ రన్‌రేటు పరంగా భారత్ (+3.050).. పాకిస్తాన్ (+0.932) కంటే అత్యంత పటిష్ట స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరుజట్లు ఫిబ్రవరి 15న తలపడాల్సి ఉంది.

**వాన పడే అవకాశం**

శ్రీలంకలోని కొలంబోలో గల ఆర్.ప్రేమదాస స్టేడియంలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు భారత్- పాక్ మధ్య మ్యాచ్ ఆరంభం కానుంది. అయితే, ఈ దాయాదుల పోరుకు వరణుడు ఆటంకం కలిగించే అవకాశం ఉంది. ఆక్యూవెదర్ నివేదిక ప్రకారం.. కొలంబోలో ఆదివారం ఉదయం వర్షం కురిసేందుకు 93 శాతం అవకాశం ఉంది. అంతేకాదు.. 26 శాతం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడేందుకు ఆస్కారం ఉంది. అయితే, సాయంత్రానికి పరిస్థితి మెరుగుపడే అవకాశాలూ కూడా ఉన్నాయి. వాన పడే ఛాన్స్ 13 శాతానికి తగ్గనుందని ఆక్యూవెదర్ వెల్లడించింది.

**యూటర్న్ తీసుకున్న పాక్**

ఇక మ్యాచ్ మొదలయ్యే సమయానికి వాన తగ్గే అవకాశం ఉన్నా.. ఒకవేళ రోజంతా వర్షం కురిస్తే అవుట్‌ఫీల్డ్ చిత్తడిగా మారే ప్రమాదం ఉంది. ఇది కూడా మ్యాచ్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. ఇదిలా ఉంటే.. టీ20 ప్రపంచకప్ టోర్నీల్లో ఇప్పటి వరకు పాక్‌తో ఎనిమిది సార్లు ముఖాముఖి తలపడ్డ భారత్ 7-1 (విజయాలు)తో ఆధిపత్యం కొనసాగిస్తోంది. కాగా బంగ్లాదేశ్‌కు మద్దతుగా తాము కూడా టీ20 వరల్డ్‌కప్-2026 బహిష్కరిస్తామంటూ పాక్ తొలుత ప్రగల్భాలు పలికిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కేవలం భారత్‌తో మాత్రమే ఆడమంటూ నాటకాలు ఆడగా.. ఐసీసీ రంగంలోకి దిగడంతో యూటర్న్ తీసుకుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143